క్లుప్తంగా

వెంకయ్య చేతుల మీదుగా పట్టా స్వీకరణ


పట్టా తీసుకుంటున్న పృథ్వి

పూతలపట్టు: మండలంలోని బత్తలవారిపల్లెకు చెందిన మురళీధర్ కుమారుడు కె.పృథ్వి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలో చదువుతున్నాడు. బుధవారం జరిగిన వార్షికోత్సవంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఎంబీబీఎస్ పట్టాను అందుకున్నారు.

భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి పూజలు


భీమేశ్వరాలయంలో పూజలు

పూతలపట్టు: మహాశివరాత్రి రోజున మండల కేంద్రంలోని భీమేశ్వరాలయంలో స్వామికి ప్రత్యేక అభిషేకంతో పూజలు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త, గ్రామస్థుల నిర్వహణతో ఆలయం చుట్టూ విద్యుత్ దీపాలతో, రకరకాల పూలతో అలంకరించారు. ఉదయం నుంచి ప్రత్యేక అభిషేకాలతో పూజలు నిర్వహించి భక్తులకు దర్శనాన్ని కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి ఆశీర్వాదం అందుకున్నారు.

నేడు చిత్తూరులో శ్మశాన కొల్ల

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని నీవానది ఒడ్డున శనివారం శ్మశాన కొల్ల(మయానసేవ)ను నిర్వహించనున్నట్లు శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయ నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారు విశేష పూజలకు అందుకుని నీవానది ఒడ్డున ఏర్పాటు చేసిన కొల్లకు బయలుదేరుతారన్నారు. అనంతరం అక్కడ దక్షసంహార ప్రక్రియను పూర్తి చేసి భక్తులకు దర్శనభాగ్యం కలిప్తామన్నారు. తర్వాత నగరవీధుల్లో ఊరేగుతారని వారు పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని దాత దేవరపల్లె మల్లికార్జున రెడ్డి(యూఎస్ఏ) ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశుకు అందించారు. ఉదయం దాత స్వామివారి దర్శనార్థం విచ్చేసి ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని అందించారు. దాతకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ వాసు, ఇన్స్పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు


యాదమరిలో వెలసిన పార్వతీదేవికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదమరి: మండలంలోని పలు గ్రామాల్లో మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఏకాంబరేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. పెరుమాళ్ల పల్లెలో వెలసిన వీర బ్రహ్మంగారి ఆలయం వద్ద స్వామివారికి కల్యాణం, అన్నదానం, ఊరేగింపు నిర్వహించారు.

భైరవునిపై శివపార్వతుల విహారం



తవణంపల్లె: కాలభైరవేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి భైరవునిపై శివపార్వతులు ఊరేగారు. ఉదయం కాళభైరవ ఉత్సవ మూర్తికి అర్చకులు అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో శనివారం ఉదయం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాత్రి అశ్వవాహన సేవను వైభవంగా నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

చిత్తూరు: ఆలయంలో విజయానందరెడ్డికి అర్చకుల ఆశీర్వాదం, బంగారుపాళెం: మొగిలీశ్వర స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు





భక్తజన సంద్రం మొగిలి క్షేత్రం

- చిత్తూరులో ఘనంగా మహాశివరాత్రి
- కిటకిటలాడిన శివాలయాలు



బంగారుపాళెం: విశేషాలంకారంలో మొగిలీశ్వరస్వామి, గుడిపాల: జ్ఞానప్రసూనాంబ సమేత యజ్ఞేశ్వరస్వామి, చిత్తూరు: విశేష పూజలు అందుకున్న కుబేర ఉమామహేశ్వరస్వామి

బంగారుపాళెం: హరహర మహాదేవ శంభో శంకర అంటూ.. మొగిలి శైవక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మొగిలీశ్వరున్ని దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు తరలి రావడంతో శివాలయం భక్తులతో సందడి నెలకొంది. ఉదయం స్వయంభు శ్రీ మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా పక్క రాష్ట్రాలైన కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు మొగిలీశ్వరాలయానికి తరలివచ్చారు. దీంతో ఆలయ క్యూలన్నీ భక్తులతో నిండిపోయాయి. పలమనేరు, చిత్తూరు డిపోల నుంచి ప్రత్యేక బస్ సర్వీసులు నడిచాయి. రాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం అనంతరం స్వామి, అమ్మవారిని వృషభ వాహనంపై ఊరేగించారు. మండలంలోని మహాసముద్రంలో ఉన్న పురాతన శివాలయం శ్రీమహదీశ్వరాలయం, చీకూరుపల్లెలోని సిద్దేశ్వరస్వామి, వజ్రాలపురంలోని శ్రీ జలకంఠేశ్వరాలయంలో మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మొగిలి శివాలయం ఆవరణలో పలువురు దాతలు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. పలమనేరు డీఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో బంగారుపాళెం సీఐ లక్ష్మయ్య, ఎస్ఐ మల్లికార్జున్ ఆధ్వర్యంలో గట్టి పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ మునిరాజు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం అభిషేకం కైలాసగిరి రావణ బ్రహ్మవాహనం, రాత్రి శేషవాహన సేవలను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

మొగిలీశ్వరునికి పట్టు వస్త్రాల సమర్పణ

స్వయంభు శ్రీమొగిలీశ్వర స్వామి వారికి కాణిపాక ఆలయం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ ఏఈఓ విద్యాసాగర్, అర్చకులు పట్టు వస్త్రాలను ఆలయ కార్యనిర్వాహణాధికారి మునిరాజుకు అందజేశారు. సిబ్బంది ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వారి దర్శనం కల్పించారు.

ఘనంగా మహాశివరాత్రి వేడుకలు

ఐరాల: మండలంలోని మఠంపల్లెలో వెలసిన శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం తరపున వస్త్రాలు తీసుకొచ్చిన ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డికి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ధనచంద్రారెడ్డి, పార్టీ నేత పూజారి మోహన్‌రెడ్డి, వేదపండితులు వారికి స్వాగతం పలికారు. శివయ్యకు ప్రత్యేక అభిషేకాలు, మహన్యాస రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. విచ్చేసిన భక్తులకు స్వామివారి దర్శనార్థం తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల కాలక్షేపం కోసం ఆలయ ఆవరణలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

మార్మోగిన శివనామ స్మరణ

గుడిపాల: మండలంలోని పలు శివాలయాలు శివనామ స్మరణతో శుక్రవారం మార్మోగాయి. పలు చోట్ల అమ్మవారికి పూజలు నిర్వహించారు. మండలంలోని 197రామాపురంలో జ్ఞానప్రసూనాంబా యజ్ఞేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త మురారి కన్నయ్య ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు శివునికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం దుర్గమ్మకు పూజలు చేశారు. శివపార్వతి కల్యాణం చేశారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగించారు. నరహరిపేట చెక్‌పోస్ట్ వద్ద భద్రకాళమ్మకు విశేష పూజలు చేశారు. కట్టకిందపల్లెలో ఉన్న గంగమ్మ, కోలావూరులో ఉన్న మల్లీశ్వరునికి అభిషేకాలు చేసి, భక్తులందరికీ అన్నదానం చేశారు.

వైభవంగా వీరబ్రహ్మంగారి కల్యాణం

మండలంలోని 197రామాపురంలో వెలసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నందు మహాశివరాత్రి పురస్కరించుకొని గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వార్ల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆలయాన్ని పచ్చని తోరణాలతో అలంకరించి స్వామివారికి పాలాభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలను ఉభయదారులు సమర్పించారు. గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామివార్లకు విశేష అలంకరణలతో అలంకరించి ఆలయ ప్రాంగణంలో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులతో లక్ష్మీదేవి, కుంకుమార్చన పూజలు నిర్వహించి ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమ, పసుపు దారం, కంకణ దారములు పంచిపెట్టారు. శివనామ స్మరణతోటి భజన బృందాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయ కార్యనిర్వాహణాధికారి బ్రహ్మయ్య తీర్థప్రసాదాలను అందజేశారు. వచ్చిన భక్తులందరికీ అన్నదానం చేశారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు

చిత్తూరు రూరల్ : చిత్తూరు నగరంలో మహాశివరాత్రిని శుక్రవారం వైభవోపేతంగా జరుపుకున్నారు. శివాలయాలు భక్తజనంతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచి రాత్రి వరకు ఆలయాల్లో అభిషేకాలు, హోమపూజలు కొనసాగాయి. భక్తజనంతో కిక్కిరిసిపోయాయి.

- ఈశ్వరగుడివీధిలోని శ్రీ అగస్త్తీశ్వరస్వామి ఆలయంలో వేకువజామున స్వామిని సుప్రభాత సేవలో మేల్కొలిపి అభిషేక పూజలు చేశారు. రుద్రాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం నుంచి భక్తులు స్వామి దర్శనంకోసం క్యూకట్టారు. ఆలయ ఆవరణలో దీపారాధన చేసి స్వామి వారిని తరించారు. వచ్చిన భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు.
- కట్టమంచిలోని కుళందీశ్వరస్వామి ఆలయంలోని స్వామి వారికి శివరాత్రిని పురస్కరించుకుని భక్తులచే పాలాభిషేకం జరిపించారు. అనంతరం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. కల్యాణ వేదికపై ఆశీనులు చేసి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.
- ఇరువారంలోని శ్రీ నాగేశ్వరస్వామి ఆలయంలో మహాభిషేకం భక్తిశ్రద్ధలతో చేశారు.
- సంతపేటలోని శ్రీ కుబేర ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ఆదిఅంతీశ్వరుడి అవతారమెత్తారు. శివలింగంలో పరమేశ్వరుడి ప్రతిమను తీర్చిదిద్దారు. బ్రహ్మ, వరాహ రూపంలో విష్ణు పరమేశ్వరుడిని వెతుకుతున్నట్లు చిత్రీకరించారు. ఈ విధానం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు శివలింగానికి పాలాభిషేకం చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

పరమేశ్వరుడి సేవలో విజయానందరెడ్డి

శివరాత్రిని పురస్కరించుకుని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ విజయానందరెడ్డి పరమేశ్వరుడి సేవలో నిమగ్నమయ్యారు. శ్రీ అగస్త్తీశ్వరస్వామి ఆలయంలోని స్వామిని తరించారు. మూలస్థానంలోని స్వామిని దర్శించుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఉత్సవమూర్తిని దర్శించుకుని కర్పూర హారతి అందుకున్నారు. అనంతరం అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆయన్ను ఘనంగా సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


చిత్తూరు: అగస్త్తీశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు


బంగారుపాళెం: మొగిలి శివాలయం వద్ద భక్తులకు అన్నదానం






చిత్తూరు: కుబేర ఉమామహేశ్వరస్వామి ఆలయంలో క్యూకట్టిన భక్తులు, శివలింగంపై ఆది అంతీశ్వరుడు, గుడిపాల: ప్రత్యేక అలంకరణలో భద్రకాళమ్మ, వీరబ్రహ్మేంద్రస్వామి కళ్యాణోత్సవం, చిత్తూరు: ప్రత్యేక అలంకరణలో అగస్త్తీశ్వరస్వామి

కాలభైరవేశ్వర ఆలయంలో లక్షబిల్వార్చన


ప్రత్యేకంగా అలంకరించిన నందీశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండల కేంద్రంలోని కాలభైరవేశ్వర ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలను భక్తిప్రపత్తులతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అంకురార్పణ, కలశప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించారు. తర్వాత ఆలయంలో అర్చకులు భక్తిప్రపత్తులతో లక్షబిల్వార్చన చేశారు. ఉదయం నుంచి శివనామస్మరణ జపంతో భజనలు చేశారు. భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులకు అన్నదానం చేవారు. మధ్యాహ్నం నందీశ్వరునికి అర్చకులు అభిషేకం, పూజలు చేయించి నైవేద్యం సమర్పించారు. సాయంత్రం ఆలయంలో మృత్యుంజయ హోమంను నిర్వహించి పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. తర్వాత లలిత సహస్రనామం, పూర్ణాహుతి హోమం చేశారు. సాయంత్రం అశేష భక్తుల నడుమ మహా రుద్రాభిషేకం నిర్వహించారు. అనంరతం శివమాల భక్తులు ఊరేగింపుగా వచ్చి అగ్నిగుండ ప్రవేశం చేశారు. తర్వాత అఖండ కర్పూర హారతి ఇచ్చారు. ఆలయ ఈఓలు వెంకటసుబ్బారెడ్డి, మునిశేఖర్ పర్యవేక్షణలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఎస్ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాణిపాకం దేవస్థానం, అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యులచే కాలభైరవేశ్వరునికి పట్టువస్త్రాలు సమర్పించారు.

దిగువ మోదలపల్లెలో

మండలంలోని దిగువ మోదలపల్లెలో మహాశివరాత్రి ఉత్సవాలను ఆరివేణి గంగమ్మ గుడి దగ్గర ఘనంగా నిర్వహించారు. వీరభద్రస్వామిని ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయంలో ఆరివేణిగంగమ్మకు పూజలు చేసి వీరభద్రస్వామిని ఎత్తుకొని భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. సిద్దేశ్వర స్వామి ఆలయంలో భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. భక్తులకు కంపలపల్లె గ్రామస్తులు అన్నదానం చేశారు. ఎగువ తవణంపల్లెలో పార్వతీదేవి సమేత నీలకంఠేశ్వర స్వామి మహా కుంభాభిషేకంను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నూతనంగా తయారు చేయించిన పంచలోహ పార్వతీదేవి, నీలకంఠేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠాపన చేయించి ఊరేగించారు.



కాళభైరేశ్వరునికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న అర్ధగిరి ట్రస్టుబోర్డు సభ్యులు, తవణంపల్లెలో కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

వేడుకగా మణికంఠేశ్వర స్వామి గ్రామోత్సవం


పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ మణి కంఠేశ్వ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఉభయదారులు, అధికారులు ఊరేగింపుగా తీసుకొచ్చి పల్లకిలో కొలువుదీర్చారు. అనంతరం పుర వీధుల్లో స్వామి వారు ఊరేగుతుండగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పూజాది కార్యక్రమాలకు పూతలపట్టు మండలం పేట అగ్రహారానికి చెందిన సుబ్రమణ్యం పిళ్లై ఉభయదారులుగా వ్యవహరించారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించండి


చెర్లోపల్లెలో ఎన్నికల ప్రచారం చేస్తున్న డాక్టర్ సునీల్‌కుమార్

- వైఎస్సార్‌సీపీతోనే ప్రజల కష్టాలు తీరుతాయి
- పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్

తవణంపల్లె: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి జగనన్నను ఆదరించాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ సునీల్‌కుమార్ అభ్యర్థించారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి మండలంలోని చెర్లోపల్లె, తొడతర పంచాయతీల్లోని గ్రామాల్లో శుక్రవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డాక్టర్ సునీల్‌కుమార్ వైఎస్సార్‌సీపీ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి ఓట్లు వేయాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించి మరోసారి సీఎం చేస్తేనే ప్రజలకు ఇంటింటికీ పథకాలు అందుతాయని భరోసా కల్పించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజారిటీ గెలిచి అధికారం కైవసం చేసుకోవడం ఖాయమని సూచించారు. టీడీపీ, జనసేన, బీజేపీలు ఒక్కటైనా జగన్ మోహన్ రెడ్డి సింహంలా ఎదుర్కొని సత్తా చాటేందుకు ప్రజలంతా వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారంలో వృద్ధులు, మహిళలు, చిన్నారులు సైతం ఆప్యాయంగా స్వాగతించి తమ ఓట్లు ఫ్యాను గుర్తుకు వేస్తామని హామీ ఇచ్చారు. అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరించి ఫ్యాను గుర్తుకు ఓటేయాలని కోరారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జి.ప్రకాష్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, వైస్ ఎంపీపీ పట్నం ప్రతాప్ రెడ్డి, నాయకులు గాంధీబాబు, హరికృష్ణారెడ్డి, రమణారెడ్డి, మధుసూదన్ రెడ్డి, తేజారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్, పరదేశి, మధుకుమార్, ప్రకాష్‌బాబురెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, రమణారెడ్డి, పూర్ణచంద్రారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, వలంటీర్లు, గృహసారథులు, కార్యకర్తలు, అనుబంధ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

శివాలయాలకు వరసిద్ధుని పట్టువస్త్రాలు

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయం నుంచి జిల్లాలోని పలు ఆలయాలకు పట్టు వస్త్రాలను ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి ఆధ్వర్యంలో సమర్పించారు. శివరాత్రి సందర్భంగా ఉదయం కాణిపాక ఆలయం నుంచి అధికారులు బంగారుపాళెం మండలంలోని మొగిలీశ్వరాలయం, మహాసముద్రంలో వెలసిన శివాలయం, తవణంపల్లెలో వెలసిన కాలభైరవేశ్వర స్వామి ఆలయం, ఐరాల మండలం మఠంపల్లె ఆలయం, కుల్లంపల్లెలో వెలసిన శివాలయం, చిత్తూరు సమీపంలోని పాల్యంతోపులో వెలసిన జలకంఠేశ్వర స్వామికి పట్టు వస్త్రాలను సమర్పించారు.




మొగిలీశ్వరస్వామికి, మహాసముద్రం శివుడికి, ఐరాల మండలంలో పరమేశ్వరునికి వరసిద్ధుని పట్టువస్త్రాలు తీసుకెళుతున్న అధికారులు